సాక్షి
విశాఖపట్నం
గురువారం। 23। మే। 2024



వైవిధ్యం..విశిష్టతల.. సమాహారం 8లో



వైభవుడికి ఊంజల్ సేవ 8లో



మరికొన్ని రైళ్లకు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు 8లో

న్యూస్‌రీల్

ఇంటర్ విద్యార్థులకు తత్కాల్ అవకాశం

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యేందుకు తత్కాల్ అవకాశం కల్పించినట్లు ఆర్‌ఐవో పి.మురళీధర్ తెలిపారు. ఈ నెల 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతున్నాయన్నారు. అనివార్య కారణాలతో ఫీజు చెల్లించలేని విద్యార్థులు తత్కాల్ విధానంలో గురువారం మధ్యాహ్నం 12 గంటల్లోపు నెట్ బ్యాంకింగ్ ద్వారా ఫీజు చెల్లించినట్లయితే పరీక్షలకు అనుమతిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా కాలేజీల ప్రిన్సిపాళ్లు తగిన చొరవ తీసుకోవాలని సూచించారు.

'దయాల్‌బాగ్'లో ఆన్‌లైన్ కోర్సులు

ఆరిలోవ: విశాలాక్షినగర్, దయాల్‌నగర్‌లోని దయాల్‌బాగ్ విద్యా సంస్థలో బి.కాం(ఆనర్స్), బీబీఏ కోర్సులను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి దక్షిణమూర్తి తెలిపారు. ఇందులో చేరాలంటే ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించాలని, వయోపరిమితి లేదన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 25లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వీటితో పాటు రెగ్యులర్ కోర్సులకు(ఆఫ్‌లైన్) కూడా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి పూర్తి చేసిన వారు ఇంజినీరింగ్ ఎలక్ట్రానిక్స్ కోర్సు(డిప్లమో)కు, ఇంటర్ బైపీసీ పూర్తి చేసిన వారు బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ కోర్సు(అగ్రికల్చర్ టెక్నాలజీ)కు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈ రెండు కోర్సులు మూడేళ్ల కాలపరిమితితో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు దయాల్‌బాగ్ నగర్‌లోని డీఈఈ సెంటర్/99633 40611కు సంప్రదించాలన్నారు.

నేడు అంతరాలయ దర్శనం రద్దు

సింహాచలం: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం అంతరాలయ దర్శనం రద్దు చేశామని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. రూ.300 టికెట్టు తీసుకునే భక్తులకు కూడా నీలాద్రిగుమ్మం వద్ద నుంచి లఘు దర్శనం ఉంటుందని, భక్తులంతా ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. బైక్‌లను గజపతి సత్రం వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశంలో మాత్రమే నిలపాలన్నారు.

పన్ను మోసం.. చెరో సగం!

అనగనగా.. ఒక ఫేక్ కంపెనీ..
ఆ ఫేక్ కంపెనీకి ఒక ఫేక్ ఓనర్..
ఆ ఫేక్ ఓనర్.. ఆ ఫేక్ కంపెనీ పేరుతో వ్యాపార లావాదేవీలు చేసినట్లు ఫేక్ ఇన్‌వాయిస్‌లు సృష్టిస్తాడు.
వాటిని జీఎస్టీ కార్యాలయంలో సమర్పించి..
ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను కొట్టేస్తాడు.
అయితే ఆ ఫేక్ కంపెనీ ఓనర్‌కి ఈ సలహా ఇచ్చింది మాత్రం.. జీఎస్టీ ఉద్యోగే.!
ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ రాగానే ఆ ఫేక్ ఓనర్.. ఈ ఒరిజినల్ ఉద్యోగి కలిసి చెరో సగం పంచేసుకుంటారు.
ఇది కథ కాదు.. జీఎస్టీ పరిధిలో నిత్యం జరిగే మోసం.
పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నకిలీ కంపెనీలను గుర్తిస్తున్నా.. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను మాత్రం ఏదో ఒక రూపంలో కేటుగాళ్లు మోసం చేస్తూనే ఉన్నారు.
అయితే వీరికి సాయం చేస్తోంది స్టేట్, సెంట్రల్ జీఎస్టీ కార్యాలయాల్లోని సిబ్బంది కావడం గమనించదగ్గ విషయం. అందుకే ఇంటి దొంగని ఈశ్వరుడైనా పట్టుకోలేడంటారు.



- ఫేక్ కంపెనీలతో నకిలీ ఇన్‌వాయిస్‌ల సృష్టి
- ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ సొంతం చేసుకునేందుకు వ్యాపారుల కుయుక్తులు
- సహకరిస్తున్న జీఎస్టీ సిబ్బంది
- ఇన్‌పుట్ వచ్చిన వెంటనే చెరో సగం పంచుకుంటున్న వైనం
- విశాఖ డివిజన్ పరిధిలో రూ.కోట్లలో మోసాలు

సాక్షి, విశాఖపట్నం: ఇంటర్ చదివి జులాయిగా తిరిగే ఓ యువకుడు రెండేళ్ల కిందట చిన్న చిన్న వ్యాపార సంస్థల్లో పని చేసి.. జీఎస్టీలో లొసుగులను పసిగట్టాడు. తర్వాత వైజాగ్, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, హైదరాబాద్ మొదలైన నగరాల్లో ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా 20 ఫేక్ కంపెనీలు సృష్టించి పన్ను మోసాలకు పాల్పడేందుకు ఎత్తుగడ వేశాడు. 20 నకిలీ సంస్థలను ఏర్పాటు చేసి బిల్లులు జనరేట్ చేశాడు. ఈ సంస్థల నుంచి దేశంలోని వివిధ నగరాల్లోని కంపెనీలకు సరకు లావాదేవీలు జరిపినట్లు రూ.265 కోట్ల మేర నకిలీ ఇన్‌వాయిస్‌లు రూపొందించాడు. వీటిని ఉపయోగించుకుని రూ.31 కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ని సొంత చేసుకునేందుకు ప్రయత్నించాడు. అప్పటికే 10 కోట్ల వరకు క్రెడిట్ చేసుకున్న యువకుడి వ్యవహారం చివరికి జీఎస్టీ విజిలెన్స్ తనిఖీల్లో బట్టబయలైంది.

రూ.200 కోట్లకు పైగా రికవరీ.. అయినా..

నకిలీ ఇన్‌వాయిస్‌ల పేరుతో మోసాలు జరుగుతూనే ఉన్నాయి. ఫేక్ కంపెనీల పేరుతో పన్నుల చెల్లింపును ఎగవేసేలా వ్యూహాలను అమలు పరుస్తున్నారు. కొన్ని కంపెనీలు.. చిన్న చిన్న తప్పులతో దొరికిపోతుంటే.. చాలా మంది వ్యాపారులు మాత్రం దర్జాగా ఇన్‌పుట్ క్రెడిట్‌ని తమ ఖాతాల్లోకి జమ చేసుకుంటున్నారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటిలిజెన్స్ విశాఖపట్నం జోనల్ యూనిట్ పరిధిలో దాదాపు 350కి పైగా నకిలీ కంపెనీల గుట్టురట్టు చేసి రూ.200 కోట్లకు పైగానే రికవరీ చేసింది. అయినా ఫేక్ కంపెనీలు నకిలీ ఇన్‌వాయిస్‌లతో రెచ్చిపోతున్నాయి.

రాష్ట్ర పన్నుల శాఖలోనూ...

కేవలం సెంట్రల్ జీఎస్టీ పరిధిలోనే కాకుండా.. రాష్ట్ర పన్నుల శాఖ పరిధిలోనూ ఫేక్ ఇన్‌వాయిస్‌ల పేరుతో మోసాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా తుక్కు పరిశ్రమలు, సిమెంట్, స్టీల్ వ్యాపారులు, సిగరెట్లు, విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న వస్తువుల విక్రయ వ్యాపారులు, వస్త్ర దుకాణాలు.. ఇలా చాలా వ్యాపారాల పేరుతో నకిలీ కంపెనీలున్నాయి. వాటిని కనిపెట్టడం పన్నుల శాఖ అధికారులకు కత్తిమీద సాముగా మారింది. వందల కోట్ల రూపాయలు కాజేస్తున్నా.. వారిని పట్టుకోలేకపోతున్నారు. ప్రతి బిల్లుని నిశితంగా పరిశీలించాల్సిన రాష్ట్ర పన్నుల శాఖ విశాఖ డివిజన్ పరిధిలోని అధికారులు, సిబ్బంది.. తూతూ మంత్రంగా పరిశీలిస్తుండటంతో మోసాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి.

సిబ్బంది చేతివాటంతోనే..

స్టేట్ జీఎస్టీ విశాఖ డివిజన్ పరిధిలోని సర్కిళ్లతో పాటు ప్రధాన కార్యాలయంలోని కొందరు సిబ్బంది ఫేక్ కంపెనీలు సృష్టిస్తున్న వ్యాపారులతో చేతులు కలుపుతున్నట్లు సమాచారం. ఫేక్ ఇన్‌వాయిస్‌లను పక్కాగా ఎలా తయారు చేయాలి? వాటిని ఏ సమయంలో సమర్పిస్తే.. ఎవరికీ అనుమానం రాకుండా పూర్తిస్థాయిలో వెరిఫికేషన్ జరగదు.. ఎలా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ని సొంతం చేసుకోవచ్చు.. ఇలా సమగ్ర వివరాలతో స్కెచ్ వేసి.. తూ.చ తప్పకుండా అమలయ్యేటట్లుగా ప్లాన్ చేస్తున్నారు. ఫైల్స్ తమ దగ్గర నుంచే వెళ్లేలా చూసుకుని.. ఎవరికీ అనుమానం రాకుండా ఇన్‌పుట్‌ని కొట్టేస్తూ.. చెరి సగం పంచేసుకుంటున్నారు. స్టేట్ ట్యాక్స్ కార్యాలయంలోని కొందరు సిబ్బందితో పాటు సూర్యాబాగ్, సిరిపురం, ద్వారకానగర్, డాబాగార్డెన్స్, కురుపాం మార్కెట్, గాజువాక, అనకాపల్లి, చినవాల్తేరు సర్కిళ్ల పరిధిలో ఈ తరహా నకిలీ ఇన్‌వాయిస్‌లు ఎక్కువగా వస్తున్నాయి. వీరికి మోసగాళ్లకు ఆయా సర్కిళ్ల పరిధిలో కొందరు ఉద్యోగులు సహకారం అందిస్తూ.. ప్రభుత్వ ఖజానాకు కన్నం వేస్తున్నారు. దీని వల్ల జీఎస్టీ వసూళ్లు పెరుగుతున్నా.. ఇన్‌పుట్ క్రెడిట్ కుంభకోణంతో ఖజానాకు చిల్లు పెడుతున్నారు. ఉన్నతాధికారులెవ్వరూ పూర్తిస్థాయిలో దృష్టి సారించకపోవడంతో ఆకాశమే హద్దుగా చెలరేగిపోతున్నారు.

రూ.1.22 కోట్లతో వైద్య పరికరాలు

ప్రాంతీయ కంటి ఆస్పత్రికి హెచ్‌పీసీఎల్ వితరణ



ప్రాంతీయ కంటి ఆస్పత్రిలో హెచ్‌పీసీఎల్ సమకూర్చిన మైక్రోస్కోప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున. చిత్రంలో హెచ్‌పీసీఎల్ ఈడీ రతన్‌రాజ్, సీజీఎం కిరణ్‌కుమార్

మహారాణిపేట: రోగులకు మెరుగైన, మరింత నాణ్యమైన వైద్య సేవలందించేలా ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్సార్)లో భాగంగా హెచ్‌పీసీఎల్ సంస్థ రూ.1.22 కోట్ల సాయాన్ని వైద్యశాలకు అందించింది. ఈ మొత్తంతో సమకూర్చిన ఆధునిక వైద్య పరికరాలను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించి, అందుబాటులోకి తీసుకొచ్చారు. నిపుణుల సూచనల మేరకు ప్రస్తుత అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫాకో మిషన్, ల్యూమిరా 300 స్టాండర్డ్ మైక్రోస్కోప్‌లు, హంఫెరీ విజువల్ ఫీల్డ్ అనలైజర్ తదితర పరికరాలను కొనుగోలు చేశారు. వైద్య పరికరాల పనితీరును కలెక్టర్ పరిశీలించారు. వాటి ప్రయోజనాలను, వినియోగ పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి, ఆప్తమాలజీ విభాగాధిపతి డాక్టర్ టి.జ్యోతిర్మయి, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.రతన్ రాజ్, చీఫ్ జనరల్ మేనేజర్ జి.కిరణ్ కుమార్, కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

నమో నారసింహ

- సింహగిరిపై వైభవంగా శ్రీనృసింహ హోమం
- తొలిసారిగా ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా భారీ ఎత్తున నిర్వహణ
- స్వామి సేవలో తరించిన ఉభయదాతలు



ప్రధాన కలశాన్ని శిరస్సుపై పెట్టుకుని తీసుకొస్తున్న ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం, నృసింహ జయంతి సందర్భంగా బుధవారం సింహగిరిపై నృసింహ హోమాన్ని వైభవంగా నిర్వహించారు. తొలిసారిగా ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 250 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. నృసింహ నామస్మరణలో భక్తులు మునిగి తేలారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ముందుగా చక్రపెరుమాళ్, స్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేర్వేరు పల్లకీల్లో.. వేద మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల మధ్య ఆలయం నుంచి ఊరేగింపుగా హోమ ప్రాంగణానికి తీసుకొచ్చారు. స్వామి ఉత్సవమూర్తులను వేదికపైన, చక్రపెరుమాళ్లను హోమగుండం వద్ద అధిష్ఠింపజేశారు. యాగంలో పాల్గొన్న ఉభయదాతలకు కంకణధారణ చేసి ఆశీనింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కలశారాధన, అగ్ని కార్యం చేశారు. అనంతరం నృసింహ హోమాన్ని విశేషంగా నిర్వహించారు. యాగంలో పాల్గొన్న ఉభయదాతలందరిచేత స్వామి అష్టోత్తరనామావళిని పఠింపజేశారు. తర్వాత పూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ కార్యక్రమాన్ని విశేషంగా చేపట్టారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి.. స్వామి మూలవిరాట్‌కి సమర్పించారు. అనంతరం ఆ జలాలను యజ్ఞశాలకు తీసుకొచ్చి భక్తులపై చల్లారు. దేవస్థానం తరఫున ఉభయదాతలకు స్వామి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రిలిగ్రిమ్స్ సెంటర్‌లో భోజనం సదుపాయం కల్పించారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు దంపతులు, ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యులు పాల్గొన్నారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధాన అర్చకులు ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, పారాయణదారులు, వేదపండితులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



హోమంలో పాల్గొన్న ఉభయదాతలు, భక్తులు



పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

కౌంటింగ్‌కు పక్కాగా ఏర్పాట్లు

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మల్లికార్జున



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున.చిత్రంలో కమిషనర్ సాయి కాంత్ వర్మ, జేసీ అశోక్

మహారాణిపేట: ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో వచ్చే నెల 4న నిర్వహించనున్న ఓట్ల లెక్కింపునకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని, ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రిటర్నింగ్ అధికారులు అత్యంత జాగరూకతతో వ్యవహరించాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులతో సమావేశం ఏర్పాటు చేసి, కౌంటింగ్ ఏర్పాట్ల గురించి వివరించాలని, తద్వారా వారిలో ఉండే అపోహలు తొలగించాలని సూచించారు. కౌంటింగ్ సెంటర్ల వద్ద సీసీ కెమెరాలు, బారికేడ్లు, కౌంటింగ్ హాల్‌లో టేబుళ్ల ఏర్పాటు, రాజకీయ పార్టీల ఏజెంట్లకు గుర్తింపు కార్డుల మంజూరు గురించి రిటర్నింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 31వ తేదీ సాయంత్రానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. పబ్లిక్ కమ్యూనికేషన్ రూమ్ ఏర్పాటు, సెల్ ఫోన్ భద్రపరచు సెంటర్, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారులకు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. కౌంటింగ్ విధుల కోసం సిబ్బంది మొదటి విడత రాండమైజేషన్ ఈ నెల 25న, రెండవ విడత రాండమైజేషన్ జూన్ 2న నిర్వహించనున్నట్లు తెలిపారు. కౌంటింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి ఈ నెల 27న శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. కౌంటింగ్ సమయానికి ఒక నిమిషం ముందు వరకు వచ్చే పోస్టల్ బ్యాలెట్లను స్వీకరించాలని ఆదేశించారు. పలు అంశాలపై అధికారులకు సూచనలు చేశారు.

సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జీవీఎంసీ ఏడీసీ కె.ఎస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, రెవెన్యూ డివిజనల్ అధికారులు హుస్సేన్ సాహెబ్, కె.భాస్కర్ రెడ్డి, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

వైవిధ్యం..విశిష్టతల సమాహారం



నిమ్మ, నారింజ పండ్ల ప్రదర్శన



ఔషధ మొక్కల స్టాల్‌లో వివరాలు తెలుసుకుంటున్న మహిళలు

వైవిధ్యం, విశిష్టతల సమాహారంగా జీవవైవిధ్య సదస్సులో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎగ్జిబిషన్ నిలిచింది. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన ఉత్పత్తులను ఇక్కడ ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాద రెడ్డి ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి తదితరులు పాల్గొన్నారు. గోవా రాష్ట్రం స్టాల్‌లో జీడిపళ్లు, స్థానికంగా లభించే జారాంబు పళ్లు, ఉసిరి తదితరాలతో తయారు చేసిన వస్తువులను ప్రదర్శించారు. గుజరాత్ స్టాల్‌లో చిరుధాన్యాల ఉత్పత్తులు ప్రదర్శించారు. ఏపీ అటవీ శాఖ, ఏపీ హార్టికల్చరల్ శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లు అందరినీ ఆకట్టుకున్నాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో లభించే పళ్లు, దుంప జాతులు, ఆకుకూరలను ఈ స్టాళ్లలో ఏర్పాటు చేశారు. కర్ణాటక రాష్ట్రం స్టాల్‌లో యాలకులు, మిరియాలు, అరబికా కాఫీ పొడి, కంది పప్పు, కేరళ స్టాల్‌లో దేవీ వరి వంగడాలు, సముద్ర నాచు నుంచి చేసిన సబ్బులు, తెలంగాణ స్టాల్‌లో దేశీ గింజలు, పప్పు ధాన్యాలను ప్రదర్శించారు. ఏపీ స్టేట్ సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ విభిన్న జాతుల విత్తనాలను విత్తన బ్యాంక్‌లో ప్రదర్శించడంతో వాటి గురించి ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం విద్యార్థులకు లభించింది. సీఎంఎఫ్ఆర్ఐ మత్స్య సంపద గురించి వివరిస్తూ స్టాల్ ఏర్పాటు చేసింది. – ఏయూక్యాంపస్




అరటి జాతుల ప్రదర్శన



వివిధ పండ్ల జాతులు



వరి కంకులు





పప్పు, చిరుధాన్యాలు



ఆవు పేడతో తయారు చేసిన కుండీలు



ఈత పళ్లు



నన్నారి మొక్క

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతా ఏర్పాట్ల పరిశీలన



భీమిలి అసెంబ్లీ నియోజకవర్గం స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున బుధవారం పరిశీలించారు. రోజువారీ తనిఖీలో భాగంగా పార్లమెంటు నియోజకవర్గం స్ట్రాంగ్ రూమ్‌తోపాటు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూమ్‌లను పోలీసు జాయింట్ కమిషనర్ ఫకీరప్ప, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌తో కలిసి తనిఖీ చేశారు. ప్రతి గదికి వేసిన తాళాలను, సీళ్లను పరిశీలించి, అక్కడ పరిస్థితులను గమనించారు. అప్రమత్తంగా ఉండాలని భద్రతా సిబ్బందికి, అధికారులకు సూచించారు. అనంతరం ఓట్ల లెక్కింపు రోజున మీడియాకు ఫలితాల వివరాలను అందించేందుకు గాను మీడియా సెంటర్ ఏర్పాటు చేయనున్న క్రమంలో సంబంధిత భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద నుంచి ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, ఇందుకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్.వి.రమణకి సూచించారు.

వైభవుడికి ఊంజల్ సేవ



ఊంజల్ సేవలో పాల్గొన్న ఈవో బండారు ప్రసాద్, భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువైన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా వైభవుడికి ఊంజల్ సేవ నిర్వహించారు. ఉదయం 5 గంటలకు స్వామికి సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, బాలభోగం, మంగళాశాసనం, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, ఋత్విక్‌వ్వరుణ, రక్షాసూత్రబంధన, మృత్సంగ్రహణం, మహానివేదన చేపట్టారు. మంగళవారం రాత్రి ఊంజల్ సేవ నిర్వహించి, బుధవారం ఉదయం తిరువీధి మహోత్సవం జరిపించారు. గురువారం ఉదయం 6 గంటలకు పౌర్ణమి సందర్భంగా స్వామికి పంచామృతాభిషేకం నిర్వహిస్తామని ఈవో బండారు ప్రసాద్ తెలిపారు.

మూర్తి యాదవ్‌నే ప్రశ్నిస్తావా?

- ఎంపీ స్వతంత్ర అభ్యర్థిపై జనసేన కార్పొరేటర్ అనుచరుల దాడి
- బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు



శంకర్ ఇంటికి దాడి చేసేందుకు వెళ్లిన మూర్తి యాదవ్ అనుచరులు (సీసీ ఫుటేజ్)

ఎంవీపీకాలనీ: శివాజీపాలెంలో ఓ యువకుడిపై స్థానిక కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అనుచరులు దాడి చేసిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఈ ఘటనపై అతను ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలివీ.. 22వ వార్డు జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ అవినీతి, అక్రమాలకు సంబంధించిన అంశాలపై మీడియాలో పలు వార్తలు వెలువడ్డాయి. దీంతో స్థానిక యువకుడు దేవర శంకర్(మంగాపురం కాలనీ) సోషల్ మీడియా ద్వారా మూర్తి యాదవ్‌ను నిలదీస్తూ పోస్టులు పెట్టారు. ప్రస్తుతం దేవర శంకర్ విశాఖ ఎంపీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశాడు. దీంతో అతను పెట్టిన పోస్టులకు ప్రాధాన్య సంతరించుకుంది. దీనిపై మూర్తియాదవ్ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. బెదిరింపు కాల్స్ కూడా చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం మూర్తి యాదవ్ అనుచరులు బోగ రవిశంకర్, గొలగాని స్వామి, కొయ్య రామకృష్ణ.. దేవర శంకర్ ఇంటికి వెళ్లి అతనిపై దాడికి పాల్పడ్డారు. మూర్తి యాదవ్‌నే ప్రశ్నిస్తావా అంటూ శంకర్‌ను పిడుగుద్దులు గుద్దారు. ఈ ఘటనపై శంకర్ ఎంవీపీ పోలీసులను ఆశ్రయించగా.. పోలీసులు ఎంఎల్‌సీ నిమిత్తం అతన్ని కేజీహెచ్‌కు పంపించారు. శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ సంజీవరావు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీలంకకు ఇండియన్ ఆయిల్ ప్రీమియం ఇంధనం

బీచ్‌రోడ్డు: శ్రీలంకకు ప్రీమియం ఇంధనం ఎక్స్‌పీ 100ని ఎగుమతి చేయనున్నట్టు ఇండియన్ ఆయిల్ డైరెక్టర్ వి.సతీష్ కుమార్ తెలిపారు. ఎగుమతి వివరాలను మీడియాకు బుధవారం వివరించారు. మొదటిసారి 100 ఆక్టేన్ పెట్రోల్ ఎక్స్‌పీ100 దేశీయంగా అభివృద్ధి చేసినట్టు చెప్పారు. నవీ ముంబైలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్‌ట్రస్ట్ నుంచి సుపీరియర్ 100 ఆక్టేన్ ప్రీమియం ఇంధనం ఎక్స్‌పీ 100ని మొట్టమొదటిసారిగా ఎగుమతి చేసినట్టు తెలిపారు. ఈ ఉత్పత్తిని శ్రీలంకకు ఎగుమతిచేయడంపై ఆనందంవ్యక్తం చేశారు. ఇది చారిత్రాత్మకమైన రోజన్నారు. ఈ ఇంధనాన్ని హై ఎండ్ వాహనాల కోసం రూపొందించినట్టు తెలిపారు.ఎక్స్‌పీ100 శ్రీలంకలోనితమకస్టమర్లకు అత్యుత్తమ పనితీరును అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. దేశం నుంచి ప్రపంచానికి నాణ్యమైన ఉత్పత్తులనుపంపగలసామర్థ్యాన్ని ఇది ప్రదర్శిస్తుందన్నారు.

మరికొన్ని రైళ్లకు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు వాల్తేర్ డివిజన్ పరిధిలో పలురైళ్లకు అత్యాధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను జతచేస్తున్నట్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. ఈ నెల 24 నుంచి విశాఖపట్నం-ఎంజీఆర్ చెన్నైసెంట్రల్(22801)వీక్లీ ఎక్స్‌ప్రెస్, 25 నుంచి ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-విశాఖపట్నం(22802) వీక్లీ ఎక్స్‌ప్రెస్, 26 నుంచివిశాఖపట్నం-పారాదీప్(22810) వీక్లీ ఎక్స్‌ప్రెస్, 27 నుంచి పారాదీప్-విశాఖపట్నం(22809) వీక్లీ ఎక్స్‌ప్రెస్, 28 నుంచి విశాఖపట్నం-కర్నూల్ టౌన్ (08585) సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్, 29 నుంచి కర్నూల్ టౌన్-విశాఖపట్నం(08586) సమ్మర్‌స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను జతచేయనున్నారు.

క్రిమినల్ చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న మాజీ ఐజీ దామోదర్

సీతమ్మధార : దేశంలో నేర న్యాయ వ్యవస్థను పూర్తిగా మార్చేందుకు తీసుకోనున్న చర్యల్లో భాగంగా కొత్తగా ప్రవేశపెట్టిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం అనే మూడు క్రిమినల్ చట్టాలపై అందరూ అవగాహన పెంచుకోవాలని మాజీ ఐజీ ఈ.దామోదర్ అన్నారు. 'వార్తా ల్యాప్ ఆన్ త్రీ న్యూ క్రిమినల్ లాస్' అనే అంశంపై డైమండ్ పార్కు సమీపంలోని ఓ హోటల్‌లో బుధవారం కేంద్ర ప్రభుత్వ ఇన్ఫర్మేషన్ బ్రాడ్ కాస్టింగ్ (విజయవాడ)కు చెందిన పీఐబీ వర్క్ షాపు నిర్వహించింది. ఈ వర్క్‌షాపులో ఆయన మాట్లాడుతూ ఈ మూడు చట్టాలు భారత శిక్షా స్మృతి (ఐపీసీ) 1860, క్రిమినల్ ప్రొసిజర్ కోడ్ (సీఆర్‌పీసీ)1973, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872లను రిప్లేస్ చేయనున్నాయని తెలిపారు. వాడుకలో ఉన్న సాంకేతికతకు అనుగుణంగా ఈ మూడు క్రిమినల్ చట్టాల్లో పలు కొత్త నిబంధనలను చేర్చినట్టు చెప్పారు. ఈ చట్టాలు నేరస్తులకు శిక్ష వేయడం కంటే బాధితులకు న్యాయం అందించడంపైనే దృష్టి పెడతాయన్నారు. వీటికి గత ఏడాది డిసెంబర్ 21న పార్లమెంట్ ఆమోదం లభించిందని, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గత ఏడాది డిసెంబర్ 25న అనుమతిచ్చారని తెలిపారు. బాధితులు తమకు జరిగిన అన్యాయంపై సంఘటన స్థలం నుంచి స్మార్ట్‌ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చని, ఆ ఫిర్యాదు రికార్డు అవుతుందని చెప్పారు. నేరస్తులను విచారించేందుకు జ్యుడీషియల్ కస్టడీ కాలపరిమితి పెంచనున్నారని తెలిపారు. పెరిగిన టెక్నాలజీని నేరాల నియంత్రణకు ఉపయోగించుకోవాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాల బాధితులను గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రిలో చేర్పితే మరణాలను నివారించవచ్చునన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన ఈ చట్టాల ద్వారా బాధితులకు న్యాయ వ్యవస్థపై మరింత నమ్మకం కలుగుతుందని చెప్పారు.

ఈ చట్టాల వల్ల పరిధితో సంబంధం లేకుండా సంఘటనా స్థలం నుంచే ఫిర్యాదు చేసి ఇ–ఎఫ్ఐఆర్ పొందవచ్చునన్నారు. ప్రజలకు దామోదర సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సి.పి.నందిని మాట్లాడుతూ గతంలో ఇండియన్ పీనల్ కోడ్‌లో కొన్ని చట్టాలు మాత్రమే ఉండేవని, తర్వాత వాటి సంఖ్యను పెంచుతూ పలు చట్టాలను చేర్చారన్నారు. ఆర్గనైజింగ్ నేరాలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయన్నారు. ముఖ్యంగా పాత్రికేయులకు ఆధునిక చట్టాలపై అవగహన ఉండాలని సూచించారు. అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర చౌదరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ వై.ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజా కోఆపరేటివ్ బ్యాంక్‌కు జాతీయస్థాయి అవార్డు

సీతమ్మధార: మహారాజా కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌కు జాతీయస్థాయి అవార్డు లభించింది. ముంబైలో జరిగిన 'భారత రత్న సహకారిత సమ్మాన్–2024'లో బ్యాంకు వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.రామకృష్ణంరాజు, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.మురళీకృష్ణ వర్మ ఈ అవార్డును అందుకున్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ డైరెక్టర్ సతీష్ మరాఠే, డైరెక్టర్ జనరల్ మినిస్ట్రీ ఆఫ్ కమ్యూనికేషన్స్, ఐటీ,గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సుమణేశ్ జోషి, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్స్, క్రెడిట్ సొసైటీ, ఐకానిక్ ఇండస్ట్రీ లీడింగ్ స్పీకర్ లక్ష్మి దాస్,నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్స్, క్రెడిట్ సొసైటీస్, ఐకానిక్ ఇండస్ట్రీ లీడింగ్ స్పీకర్స్ అజయ్ బ్రహ్మ హెచ్ తదితరుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణంరాజు, మురళీకృష్ణ వర్మ మాట్లాడుతూ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. త్వరలో తుని, అనకాపల్లి శాఖలను ప్రారంభించనున్నట్టు బ్యాంక్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.రామకృష్ణంరాజు, జనరల్ మేనేజర్ ఎస్.ఎస్. సత్యనారాయణ తెలిపారు.

విధులకు హాజరైన కేజీహెచ్ సూపరింటెండెంట్

మహారాణిపేట: అస్వస్థతకు గురైన కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ బుధవారం విధులకు హాజరయ్యారు. ఈనెల 16న ఆయన విధి నిర్వహణలో ఉండగా అస్వస్థతకు గురికావడంతో కేజీహెచ్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నగరంలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లిన విషయం తెలిసిందే. చికిత్స పొందిన అనంతరం.. బుధవారం డీఎంఈ డాక్టర్ నరసింహం నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో పాల్గొన్నారు.

నేడు మిగిలిన సగం జీతాల చెల్లింపు

- ఉక్కుకార్మిక సంఘాల భేటీలో సీఎండీ హామీ



ఉక్కు యాజమాన్యంతో జరిగిన సమావేశంలో పాల్గొన్న సీఎండీ, డైరెక్టర్లు, కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల బకాయి(సగం) జీతాలను గురువారం చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించింది. బుధవారం ఉక్కు యాజమాన్యంతో కార్మిక సంఘాల నేతల భేటీలో ఈ మేరకు ఉక్కు సీఎండీ అతుల్‌భట్ హామీ ఇచ్చారు. జీతాల చెల్లింపులో ఆరు మాసాలుగా యాజమాన్యం అవలంభిస్తున్న వైఖరికి నిరసనగా అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు బుధవారం డెడికేషన్ పార్కులో సమావేశమయ్యారు. అక్కడ తీసుకున్న నిర్ణయం మేరకు సుమారు 30 మంది ఉక్కు అడ్మిన్ బిల్డింగ్‌కు వెళ్లారు. అప్పటికే అక్కడ పెద్ద ఎత్తున మోహరించిన పోలీసులు వారిని లోపలికి పంపేందుకు నిరాకరించారు. దీంతో నాయకులకు, పోలీసులకు మధ్య కాసేపు వాగ్వాదం నెలకొంది. ఆ తర్వాత వారిని లోపలికి పంపారు. ఉక్కు సీఎండీ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన సమావేశంలో నాయకులు యాజమాన్యం తీరును ఆక్షేపించారు. ప్లాంట్ ఉత్పత్తి, ఉత్పాదకతలో కీలకంగా ఉన్న ఉద్యోగులకు జీతాల చెల్లింపులో నిర్లక్ష్యం సరికాదన్నారు. జీఎస్టీ, విద్యుత్ బిల్లులు, ముడి పదార్థాల చెల్లింపులకు ఇచ్చే ప్రాధాన్యత జీతాల చెల్లింపునకు ఇవ్వరా? అని ప్రశ్నించారు. దీంతో సీఎండీ అతుల్ భట్ మాట్లాడుతూ యాజమాన్యం కావాలని జీతాల చెల్లింపుల్ని జాప్యం చేయలేదని, అనివార్య పరిస్థితుల వల్ల అలా జరుగుతోందన్నారు. ఎన్ఎండీసీతో ఒప్పందం జరిగితే ఆర్థికంగా కొంత వెసులుబాటు కలుగుతుందన్నారు. బార్స్ కమిటీ నివేదికపై జూన్ 1 నాటికి తుది నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఈలోగా ఒక మెడికల్ పర్మిషన్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు డి.ఆదినారాయణ, కేఎస్ఎన్ రావు, మంత్రి రాజశేఖర్, సీరుకొండ రామచంద్రరావు, జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, రామ్మోహన్‌కుమార్, దొమ్మేటి అప్పారావు, సన్యాసిరావు, కామేశ్వరరావు, వరసాల శ్రీనివాస్, డేవిడ్ శ్రీనివాసనాయుడు, నమ్మి సింహాద్రి, పల్లా పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: పలు పెయిరింగ్ రైళ్ల ఆలస్యంగా చేరిన కారణంగా.. ఆయా స్టేషన్ల నుంచి రైళ్లు ఆలస్యంగా బయలుదేరినట్లు రైల్వే అధికారులు తెలిపారు. బుధవారం ఉదయం 10.35 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరాల్సిన ఎస్ఎంవీ బెంగళూరు-హౌరా(12864) ఎక్స్‌ప్రెస్ సుమారు గంటన్నర ఆలస్యంగా మధ్యాహ్నం 12 గంటలకు బయల్దేరింది. రాత్రి 8గంటలకు విశాఖపట్నంలో బయలుదేరాల్సిన విశాఖపట్నం-నాందేడ్ (20811) ఎక్స్‌ప్రెస్ సుమారు గంటన్నర ఆలస్యంగా రాత్రి 9.30 గంటలకు బయల్దేరింది. రాత్రి 11.20 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరాల్సిన విశాఖపట్నం-లోకమాన్యతిలక్ టెర్మినస్(18519) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ సుమారు గంట ఆలస్యంగా మధ్యరాత్రి 12.20 గంటలకు బయల్దేరింది.

దారి మళ్లింపు

తిరుపతి-కాట్పడి సెక్షన్ పరిధి బొమ్మ సముద్రం స్టేషన్ వద్ద జరుగుతున్న లూప్‌లైన్ పనుల కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. ఈ నెల 27న ఎస్ఎంవీ బెంగళూరు-టాటానగర్(12890) ఎక్స్‌ప్రెస్, 28, 30వ తేదీల్లో ఎస్ఎంవీ బెంగళూరు-హతియా(12836) ఎక్స్‌ప్రెస్ వయా కాట్పడి-మెల్పక్కం, రేణిగుంట మీదుగా నడుస్తాయి.

- ఖరగ్‌పూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతా పనుల కారణంగా జూన్ 6న చెన్నై సెంట్రల్-న్యూ జల్పాయ్‌గురి(22611) ఎక్స్‌ప్రెస్ వయా టాటానగర్-పురూలియా-కోట్‌శిలా స్టేషన్ల మీదుగా నడుస్తుంది.

నూతిలో ఈతకొడుతూ వ్యక్తి మృతి



శివకుమార్ మృతదేహం

దత్తిరాజేరు: విశాఖపట్నం సీతమ్మధారకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ కుచ్చరపాటిశివకుమార్ (60) ప్రమాదవశాత్తూ నూతిలో ఈతకొడుతూ మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే... విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం చినకాదలో జరుగుతున్న గ్రామదేవత పండగకు బంధువుల ఇంటికి శివకుమార్ వచ్చాడు. గ్రామ సమీపంలోని రాజులపేట వద్ద ఉన్న బావిలో మంగళవారం సాయంత్రం దిగి ఈత కొడుతుండగా.. ఊబిలో కాళ్లు కూరుకుపోయి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు భార్గవ్‌రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శిరీష తెలిపారు.